సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం : 5 : అక్టోబర్ : 2024



సోమశిలలో 52.155 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 52.155 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 2 వేలు. ఉత్తర, దక్షిణ కాలువలకు 540, 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.78,290
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,115
3శాతం జీఎస్టీతో	రూ.7,328
నవర (8గ్రా)	రూ.58,624

గరిష్టం/కనిష్టం
37.5 /25.8

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం తేమతో కూడి ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 100 శాతంగా శుక్రవారం నమోదైంది.

చంద్రబాబు 'కొవ్వు' ఆరోపణలు తేలిపోతాయి



కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో చంద్రబాబు 'కొవ్వు' ఆరోపణలు తేలిపోతాయి. సుప్రీం తీర్పు చెంపపెట్టు వంటిది. పవిత్రమైన తిరుమల క్షేత్రాన్ని స్వార్థ రాజకీయాల కోసం 'కొవ్వు' ప్రచారంతో అపవిత్రం చేశాడు. వెంకటేశ్వరస్వామి వారి ప్రతిష్టను, ప్రసాదాల పవిత్రతను దెబ్బతీయాలని ప్రయత్నించాడు. వంద రోజుల పాలనలో ఇది చేశామని చెప్పుకోలేక ప్రజల దృష్టి మరల్చేందుకు సాక్షాత్తు దేవదేవుడిని రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గం. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు భక్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. ఏమాత్రం నైతికత ఉన్నా.. దేవదేవుడిపై విశ్వాసం ఉంటే.. వాస్తవాలు నిగ్గుతేలే వరకు సీఎం పదవికి రాజీనామా చేయాలి. పవన్‌కల్యాణ్ సనాతన ధర్మానానికి ఆయనే అధ్యుడనని వారాహి సభలో వెల్లడించడం విడ్డూరంగా ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పునే తప్పుపట్టే విధంగా మాట్లాడిన పవన్‌పై సుమోటోగా కోర్టు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి, జిల్లా అధ్యక్షుడు

భక్తుల మనోభావాలను గౌరవించాలి



తిరుమల వెంకటేశ్వరస్వామిపై భక్తితో కోట్లాది మంది ఆలయానికి వస్తుంటారు. తిరుపతి మహాప్రసాదమైన లడ్డూకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. అలాంటి పవిత్రమైన లడ్డూ తయారీపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రకటనలు చేయడం సరికాదు. సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంప పెట్టు వంటిదే. ఒక్కొక్క శాఖ నుంచి ఇద్దరు చొప్పున సిట్‌లో సభ్యులుగా నియమించి దర్యాప్తు చేయాలని ఆదేశించడం మంచి పరిణామం.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆత్మకూరు

నిజాలు నిగ్గు తేలుతాయి



పవిత్రమైన తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన తప్పుడు ప్రచారంలో సుప్రీం కోర్టు నియమించిన స్వతంత్ర దర్యాప్తు సంస్థ విచారణతో నిజాలు నిగ్గు తేలుతాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక తిరుమల లడ్డూలో 'కొవ్వు' కలిసిందంటూ దుష్ప్రచారం చేయడం బాధాకరం. చంద్రబాబు ప్రచారం నిజమనుకునేలా ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీం కోర్టు రద్దు చేయడం ఆయనకు చెంపపెట్టు. ప్రపంచంలోనే పవిత్రమైన తిరుమల క్షేత్రం ప్రతిష్టను, స్వామివారి లడ్డూ విశిష్టతను తగ్గిస్తూ కోట్ల మంది భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. చంద్రబాబు తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పు పట్టింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు నైతిక బాధ్యత వహించి సీఎం పదవి నుంచి తప్పుకోవాలి.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కావలి

సుప్రీం తీర్పు చెంపపెట్టు

➠ చంద్రబాబు కొవ్వు రాజకీయానికి చెక్

- పవిత్రమైన తిరుమల లడ్డూపై 'కల్తీ' ఆరోపణలు
- స్వప్రయోజనాల కోసమే పవిత్ర పుణ్యక్షేత్రంపై రాజకీయం
- అబద్ధాలను నిజమనుకునేలా రోజుకో దుష్ప్రచారం, నాయకుల నాటకం
- కూటమి వంద రోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వివాదం
- చంద్రబాబు సిట్ రద్దు, స్వతంత్ర సంస్థ దర్యాప్తునకు సర్వత్రా స్వాగతం

భువిపై కలియుగ వైకుంఠ క్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుమల లడ్డూల తయారీలో 'కల్తీ' నెయ్యి వాడారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఏపీ సీఎం చంద్రబాబుకు చెంపపెట్టు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు వంద రోజుల పాలనా వైఫల్యాలను, బుడమేరు వరద కారణాలను డైవర్ట్ చేసేందుకు ఆకస్మికంగా చంద్రబాబు 'కొవ్వు' రాజకీయానికి తెర తీశారు. తాను చేసిన ఆరోపణలు నిజమని హిందూ భక్తులను నమ్మించేందుకు మనోభావాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా చంద్రబాబు అనేక విన్యాసాలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల ఆరాధ్య దైవమైన తిరుమల వెంకటేశ్వరుడి ప్రతిష్టతను దెబ్బ తీస్తూ రాజకీయంగా వాడుకునేందుకు చేసిన చంద్రబాబు తీరును తప్పు పడుతూ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు, దర్యాప్తు ఆదేశాలను దేశం సర్వత్రా స్వాగతిస్తోంది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ నెల్లూరు(బారకాసు)/ నెల్లూరు (బృందావనం)/ కావలి/ఉదయగిరి/ పొదలకూరు/ఆత్మకూరు: కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కొవ్వుతో కూడిన నెయ్యి వాడారంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చేసిన, చేస్తున్న దుష్ప్రచారంపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ కల్తీ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు స్వతంత్ర దర్యాప్తునకు సుప్రీం ఆదేశాలివ్వడం చంద్రబాబుకు చెంపపెట్టు లాంటిదని నిత్యం నిష్ఠాగరిష్ఠలతో దైవ పూజ చేసే వేద పండితుల నుంచి సామాన్య భక్తుల వరకు వ్యాఖ్యానిస్తున్నారు. స్వతంత్ర సంస్థలతో విచారణ చేపట్టడాన్ని స్వాగతించారు. చంద్రబాబు వ్యవహరించిన తీరును గర్హించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమంటూ మండిపడ్డారు. కల్తీ నెయ్యి పేరుతో చంద్రబాబు తిరుమల పవిత్రతను దెబ్బ తీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాజకీయ విన్యాసాలపై విమర్శలు గుప్పించారు. రాజకీయాల కోసం ప్రత్యక్ష దేవదేవుడిని రాజకీయాల్లోకి లాగడంపై మొదటి నుంచి హిందూ భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందరికీ ఆరాధ్య దైవమైన తిరుమల వెంకటేశ్వరుడి ప్రతిష్టతను దిగజార్చే ప్రయత్నం చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన విషయం విదితమే. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ చంద్రబాబు చేసిన దుష్ప్రచారంలో నిజం లేదని, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో దర్యాప్తు, స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని అభ్యర్థిస్తూ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్, వైవీ సుబ్బారెడ్డి కూడా పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీరితో పాటు మరికొందరు చేసిన ఫిర్యాదులపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించిన తీర్పుతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏ విధంగానైనా అప్రతిష్ట పాల్జేయాలన్న దుర్మార్గమైన ఆలోచన చేసిన చంద్రబాబు చివరికి తాను తీసిన గుంతలో తానే పడ్డట్టు అయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరో వైపు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చకుండా కాలయాపన చేయడంపై చంద్రబాబుపై ప్రజలు విరుచుకుపడుతున్నారు. చంద్రబాబు తన పరిపాలనలో విఫలం కావడంతో ప్రజలు ఎక్కడ తమపై తిరగబడతారోనని డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు 'కొవ్వు' రాజకీయానికి దర్యాప్తు తర్వాత తెరపడుతుందని పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం



ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టంగా తిరుమల కొండపై కొలువైన కలియుగ వైకుంఠ క్షేత్ర ప్రాశస్త్యాన్ని, పవిత్రతను, స్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేస్తూ చంద్రబాబు చేసిన రాజకీయానికి చెక్ పెడుతూ కల్తీ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తునకు సుప్రీం ఆదేశించడాన్ని హర్షిస్తున్నాం. స్వాగతిస్తున్నాం. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ చంద్రబాబు చేసిన దుష్ప్రచారంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. శ్రీవారి భక్తులు యావత్తు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. లడ్డూలో కల్తీ ప్రచారంలో నిజం లేదని, న్యాయస్థానం చొరవతో న్యాయం జరుగుతుందని మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ చెబుతూనే ఉంది. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన చంద్రబాబుకు ఏ మాత్రం భక్తి, భయం ఉంటే భక్తులుకు క్షమాపణ చెప్పి, రాజకీయాల నుంచి తప్పుకోవాలి. తప్పకుండా హిందువుల మనోభావాలకు త్వరలోనే ఊరట లభిస్తుంది.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ సమన్వయకర్త

నిజానిజాలు బహిర్గతం చేయాలి



కలియుగ దైవం శ్రీవారి లడ్డూ ప్రసాదంపై కోట్లాది మంది భక్తులకు తలెత్తిన పలు సందేహాలు నివృత్తి కావాలి. నిజానిజాలు నిగ్గు తేలి అసలు దోషులెవరో తెలియాలి. దేశ సర్వోన్నత న్యాయస్థానం లడ్డూ కల్తీ వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో సిట్ ఏర్పాటు చేయడం హర్షణీయం. దెబ్బతిన్న భక్తుల మనోభావాలకు సాంత్వన చేకూరాలంటే త్వరితగతిన నిష్పాక్షికంగా దర్యాప్తు వేగవంతంగా నిర్వహించాలి. – ఉదయగిరి వేంకటశేషాచార్యులు, ప్రధాన కార్యదర్శి, జిల్లా అర్చక సమాఖ్య

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో చోటు చేసుకొన్న కల్తీ వ్యవహారానికి సంబంధించి ఐదుగురు సభ్యుల సిట్ బృందం వాస్తవాలను వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నాం. దర్యాప్తు బృందం స్వతంత్రంగా వ్యవహరించేలా చూడాలి. ఏ ప్రభుత్వంలో జరిగినా అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. భక్తుల మనోభావాలు గాయపరిచేలా, తిరుమల శ్రీనివాసుడి లడ్డూ ప్రసాదంలో ఇటువంటి ప్రచారం చోటు చేసుకోవడం విచారకరం. – పారా శ్రీధర్‌శర్మ, ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘం

దోషులెవరో తేలిపోతోంది



తిరుమల శ్రీనివాసుడి లడ్డూ ప్రసాదంలో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం సహేతుకమైంది. ఎటువంటి లోటుపాట్లుకు తావివ్వకుండా సిట్ బృందం దర్యాప్తు చేసేలా స్వతంత్ర అధికారాలు ఇవ్వాలి. అప్పుడే అసలు దోషులెవరో తేలిపోతుంది. ఈ దర్యాప్తు జాగు చేస్తే, వాస్తవాలు మరుగుపరిస్తే అందుకు బాధ్యులైన వారికి కలియుగ దైవంతోనే ఆటలాడితే ఆ దేవదేవుడి చేతిలో దండన తప్పదు. ధర్మాన్ని కాపాడిన వారిని ఆ ధర్మమే కాపాడుతోంది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారికి, తిరుమల క్షేత్ర పవిత్రతను అపవిత్రం చేసిన వారు రాజ్యాపాలకులుగా అనర్హులు.

– ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య

దేవదేవుడితోనే చంద్రబాబు గేమ్స్



చంద్రబాబు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పవిత్రమైన లడ్డూకు అపవిత్రతను ఆపాదించాడు. తద్వారా రాజకీయ లబ్ధిపొందాలనే కుట్రను సుప్రీం ఎండగట్టింది. చంద్రబాబు రాజకీయ జీవితంలో అనేక అబద్దాలు ఆడినా, దేవుడు విషయంలో కూడా మినహాయింపు ఇవ్వలేదు. సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు సంస్థ సిట్‌ను నియమించి దర్యాప్తునకు ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామం. నిజాలు నిగ్గు తేలే అవకాశం ఉంది. బాబు రాజకీయ కుట్ర కోణం బయటపడుతుంది.

– మోదీ రామాంజనేయులు, ఉదయగిరి

కల్తీ నెయ్యి ఒక అభూత కల్పన



పవిత్రమైన తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అనేది చంద్రబాబు అభూత కల్పన. చంద్రబాబు వంద రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమిలేదు. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు చేసిన కుట్రలో భాగమే. టీడీటీ అధికారులు లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడలేదని స్పష్టంగా చెబుతున్నా.. బాబు రాజకీయ ప్రయోజనాల కోసం కల్తీ నెయ్యితో లడ్డూ చేశారంటూ తప్పుపై తప్పు చేశారు. తాను చేసిన తప్పుడు ఆరోపణలను నిజమని నిరూపించేందుకు ఆయన కనుసన్నల్లో పని చేసే అధికారులతో సిట్ వేసి తనకు అనుకూలంగా రిపోర్టు తెచ్చే పన్నాగం పన్నినా, సుప్రీం కోర్టు తీర్పుతో అది పారలేదు.

– రేవునూరు శ్రీనివాసరెడ్డి, వింజమూరు

ఇసుకను అందుబాటులోకి తేవాలి

- నిర్మాణ రంగం కుదేలైంది
- బేల్దారి కూలీలకు పనుల్లేవు
- ట్రాక్టర్ల యజమానులకు బాడుగులు లేవు
- నెల్లూరురూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఉచిత ఇసుక'ను ప్రజలందరికీ వెంటనే అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చి ప్రజలకు ఉచితంగా అందిస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసిందన్నారు. ఉచిత ఇసుక లభ్యత లేకపోవడంతో గ్రామాల్లో, పట్టణాల్లో ఇళ్లు నిర్మించుకునే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధిక ధరలను వెచ్చించి బ్లాక్ మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఉపాధి పొందేవారని, నేడు వారందరికీ పని లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని వ్యవసాయ కార్మికులు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్నారని, ఉచిత ఇసుక లభించకపోవడంతో వారందరూ పనులు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా వెంటనే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి ఇసుకను అందుబాటులోకి తెచ్చి ప్రజలను కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌కే గౌస్‌పీర్ మండల నాయకులు పూడిపర్తి జనార్దన్, శ్రీపతి వెంకయ్య, అట్లా అనిల్, గుంటి నాగరాజు, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు జరిగిన జాబ్‌మేళాకు ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన 44 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఇన్నోవ్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థలు పాల్గొని 25 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ స్కిల్ హబ్ ఇన్‌చార్జి డాక్టర్ మేరీ సందీప్ సీడాప్ జేడీ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

టెట్‌కు 136 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): జిల్లాలో జరిగిన టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) 3 సెంటర్లలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. రెండు సెషన్స్‌లో మొత్తం 136 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 364 మందికి గాను 308 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 725 మందికి 645 మంది హాజరయ్యారు. 80 మంది గైర్హాజరయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన డీపీఓ



శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): జిల్లా పంచాయతీ అధికారిగా శ్రీధర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన సుష్మితారెడ్డి బదిలీ కావడంతో శ్రీధర్‌రెడ్డిని ప్రభుత్వం డీపీఓగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తామన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటరణమణ

నెల్లూరు (పొగతోట): రేషన్ పంపిణీ విషయంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం కార్యాలయంలో ఏఎస్‌ఓలు, సీఎస్ డీటీలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్‌ఓ మాట్లాడారు. రేషన్ పంపిణీ ప్రక్రియను సీఎస్‌డీటీలు, ఏఎస్‌ఓలు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రేషన్ షాపులు, పెట్రోలు బంకులు, తనిఖీలు నిర్వహించాలన్నారు. రైస్ మిల్లులు, పప్పు దినుసులు విక్రయించే వ్యాపార సంస్థలు రికార్డులు పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఓ అంకయ్య, రవి కుమార్, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలపై ప్రత్యేక దృష్టి

- రోడ్ల మరమ్మతులకు పది రోజుల్లో టెండర్లు
- మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (బారకాసు): నెల్లూరులో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం కమిషనర్ సూర్యతేజతో కలిసి పలుశాఖల అధికారులు, సిబ్బందితో మంత్రి సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ నగర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలను నిర్మించి భూగర్భ డ్రైయినేజీ విధానానికి అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పలు సమస్యలు, అభివృద్ధి విషయాలపై సుదీర్ఘంగా అధికారులతో మంత్రి చర్చించారు. నగరంలోని కొన్ని రోడ్లు మరమ్మతులు చేపట్టేందుకు మరో పది రోజుల్లో టెండర్లు పిలిచి పనులకు పురమాయిస్తామన్నారు. సింహపురి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్ట్ మరో ఆరునెలల్లో పూర్తి చేస్తామన్నారు. పార్కుల అభివృద్ధికి వేగవంతంగా చర్యలు చేపడతామన్నారు. పచ్చదనం మెరుగు పరిచేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వాళ్లను కూడా స్వాగతిస్తున్నామన్నారు. టిడ్కో గృహాలకు రోడ్ల నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. నెల్లూరు నగరంలో ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ సమస్య ఉందని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

నూతన విధానాలను అమలు చేయండి

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ పాలనకు సంబంధించి నూతన విధానాలను పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలకు ప్రజా పరిషత్ నూతన విధానాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీఈఓ మాట్లాడారు. మండల, గ్రామ స్థాయిలో నూతన విధానాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నిబంధనల మేరకు పాలన కొనసాగించాలన్నారు. 7, 8, 9 తేదీల్లో మండల స్థాయిలో సర్పంచ్‌లకు నూతన విధి విధానాలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షణ పరిశీలకులు రమేష్, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

- చెరువు ఉనికి ప్రశ్నార్థకం



ముత్తుకూరు చెరువులో జేసీబీ, ట్రాక్టర్లతో మట్టి తరలింపు

ముత్తుకూరు: ముత్తుకూరు చెరువులో కొద్ది రోజులుగా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. చెరువు ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ పదుల సంఖ్యలో జేసీబీలు, ట్రాక్టర్లు పెట్టి మట్టి తవ్వేసి తరలిస్తున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి అండదండతో మట్టి తరలిపోతున్నట్లు జిల్లా స్థాయి అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో ఎక్కడబడితే అక్కడ.. ఇష్టారాజ్యంగా భారీగా గోతులు పెట్టి అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తే భవిష్యత్‌లో చెరువు పరిస్థితి ఏమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.2 వేల లెక్కన లే-అవుట్లకు మట్టిని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ, ట్రాక్టర్లతో చెరువును గుల్ల చేస్తున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలకు అడ్డూఅదుపు లేకపోవడంతో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఇకనైనా సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకుని అక్రమంగా తరలిస్తున్న మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఎఫ్‌ఓగా మహబూబ్‌బాషా



మహబూబ్‌బాషా

నెల్లూరు(అర్బన్): జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా కె.మహబూబ్ బాషాను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గుంటూరు డీఎఫ్‌ఓగా పని చేస్తూ బదిలీపై నెల్లూరుకు రానున్నారు. ఇటీవల నెల్లూరు డీఎఫ్‌ఓగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను అనంతపురానికి బదిలీ చేయడంతో ఆ స్థానంలో బాషాను ప్రభుత్వం నియమించింది. గతంలో ప్రకాశం జిల్లా డీఎఫ్‌ఓగా పని చేస్తూ కొంతకాలం ఆయన నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా పనిచేశారు.

మందకొడిగా మద్యం దరఖాస్తులు

- 9న తుది గడువు

నెల్లూరు (క్రైమ్): మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. జిల్లాలో 182 మద్యం దుకాణాల ఏర్పాటుకు కలెక్టర్ ఈ నెల ఒకటో తేదీన నోటిఫికేషన్ జారీ చేశారు. అదే రోజు నుంచే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కూటమి నేతలు దుకాణాలను దక్కించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఎవరు దరఖాస్తు చేసినా అంతిమంగా తమకే దక్కేలా పావులు కదుపుతున్నారు. తమ అనుయాయులకు డబ్బులిచ్చి దరఖాస్తులు చేయిస్తున్నారు. దరఖాస్తు ఫీజు భారీగా పెరగడం, కూటమి నేతలు సిండికేట్ కావడంతో ఆశావహులు దరఖాస్తులు వేసేందుకు జంకుతున్నట్లు తెలుస్తోంది. దీంతో గడిచిన నాలుగు రోజుల్లో పది లోపే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. దరఖాస్తుల స్వీకరణకు కేవలం ఐదు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఎన్ని దుకాణాలకు దరఖాస్తులు వేస్తారో అనే టెన్షన్ ఎక్సైజ్ అధికారుల్లో మొదలైంది. దీంతో కొందరు అధికారులు వ్యాపారులకు ఫోన్లు చేసి దరఖాస్తులు దాఖలు చేయాలని చెబుతున్నారు.

నేటి నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో 3వ రాష్ట్రస్థాయి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఈ నెల 5, 6, 7 తేదీలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింహపురి వైద్య సేవా సమితి, మత్స్యకార సంక్షేమ సమితి, మత్స్యశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర మంత్రులు జార్జ్‌కురియన్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని పేర్కొన్నారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

చిరుజల్లుతో సాంత్వన



గొడుగు కింద నడుచుకుంటూ..

తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నెల్లూరు నగర ప్రజలు శుక్రవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి చల్లని గాలులు వీచాయి. వెంటనే మేఘాలు వర్షించడంతో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే వారు గొడుగులు వేసుకుని బయలుదేరారు. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి, మర్రిపాడు తదితర ప్రాంతాల్లో కూడా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది.

– ఫొటోలు, సాక్షి ఫొటోగ్రాఫర్



కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద..



గొడుగున్నా.. ముందుకుపడని అడుగు



ద్విచక్ర వాహనంపై వెళుతూ..

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నేతల డిమాండ్



వీఆర్సీ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే విరమించుకోవాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్యలు డిమాండ్ చేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీఆర్సీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరాజ్, రమణయ్యలు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ కోవలోనే కొన్ని సంవత్సరాల నుంచి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నారని, అందులో భాగంగా 4,290 మంది కార్మికులను తొలగిస్తూ అర్ధరాత్రి నోటీసులు ఇవ్వటం దారుణమని అన్నారు. అంబానీ, అదానీ లాంటి బడా పారిశ్రామిక వేత్తలకు బీజేపీ బానిసగా పనిచేస్తోందని మండిపడ్డారు. రాజకీయ అవగాహన లేని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు రంగంలోకి దించి అతని చేత తిరుమల లడ్డూ వివాదంపై మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్‌వాజ్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజీజ్ అహ్మద్, షాజహాన్, గయాజ్, రాజేష్, రమేష్, శ్రీనివాసులు, రామచంద్రయ్య, విజయ, లక్ష్మయ్య, రాజశేఖర్, ఎస్ దానీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పది కేజీల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

కోవూరు: నలుగురు స్నేహితులు విలాసాలకు అలవాటు పడ్డారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణాను అలవాటు చేసుకున్నారు. ఇలా కోవూరులో చిన్న ప్యాకెట్లుగా గంజాయిని విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కోవూరు సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. కోవూరు జాతీయ రహదారి సమీపంలో నందలగుంట వద్ద కొందరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అక్కడ నెల్లూరు రూరల్ మండలం, నారాయణరెడ్డిపేట రామాలయం వీధికి చెందిన చీమకుర్తి సుజిత్, కోవూరు టౌన్ నాగలకట్టకు చెందిన పసుపులేటి రవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా మరో ఇద్దరి గురించి సమాచారం అందింది. వారిలో నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేట, రామాలయం వీధికి చెందిన చుక్కల శంకర్ నారాయణ, అదే ప్రాంతంలోని సత్యసాయి స్కూల్ వద్ద నివాసముంటున్న మోఫిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో తొమ్మిది కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఇలా మొత్తం పది కేజీల గంజాయిని సీజ్ చేశారు. అంతేకాకుండా ఓ స్కూటీని కూడా సీజ్ చేశారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.22.50 లక్షలు ఉంటుందని తెలిపారు .

ఒడిశా నుంచి అక్రమ రవాణ

నెల్లూరుకు చెందిన మోఫిద్, శంకరనారాయణ బల్క్‌గా పది కేజీల గంజాయిని ఒడిశా నుంచి నేరుగా నెల్లూరుకు తీసుకొచ్చారు. ఇక్కడ సుజిత్, రవి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇలా విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు.

భార్య చేతిలో భర్త హతం

- కుమారుడిని కాపాడే క్రమంలో రోకలిబండతో దాడి
- నగరంలోని మెక్లిన్స్ రోడ్డులో ఘటన

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ కుమారుడిని కాపాడుకునే క్రమంలో రోకలి బండతో భర్త తలపై బలంగా మోదగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి మెక్లిన్స్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మెక్లిన్స్ రోడ్డు హుడా మసీద్ సమీపంలో షేక్ సుభాని (48), కౌసర్‌బేగం దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముజాజ్, సోను, ఎలియాజ్‌లు సంతానం. సుభాని సోఫాలు కుట్టే పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకోసాగారు. అతను మద్యానికి బానిసయ్యాడు. ఆరు నెలలుగా ప్రతి రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, కుమారులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో 3వ తేదీ అర్ధరాత్రి సుభాని మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడసాగాడు. పెద్ద కుమారుడు ముజాజ్ అతనిని వారించాడు. కోపోద్రిక్తుడైన సుభాని వంటింట్లోకి వెళ్లి రోకలిబండ తీసుకువచ్చి ముజాజ్‌పై దాడికి యత్నించగా కౌసర్ బలవంతంగా రోకలిబండను లాక్కొంది. దీంతో మరో మారు వంటింటిలోకి వెళ్లి కత్తిని తీసుకు వచ్చి కుమారుడిని పొడవబోతుండగా కౌసర్ రోకలిబండతో భర్త తలపై బలంగా మోదగా తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుని చిన్నకుమారుడు ఎలియాజ్ శుక్రవారం తెల్లవారుజామున చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

నర్సింగ్ విద్యార్థినులపై ఫీజులుం

- ఒక్కొక్కరి నుంచి క్లినికల్ ఇంటర్న్‌షిప్ రూ.3.5 లక్షలు కాలేజీకే జమ
- అయినా రూ.50 వేలు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ పేచీ

కావలి: కావలిలోని శ్రీ సాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ పేద విద్యార్థినుల వద్ద ఫీజులు దందా కొనసాగిస్తూనే ఉంది. ఏడాది క్రితం ఇదే విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వకుండా ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని మొండికేసింది. దీంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కాలేజీ వద్ద ఆందోళన చేశారు. దీంతో కలెక్టర్ జోక్యం చేసుకోవడంతో అధికారులు రంగంలోకి దిగి కాలేజీ యాజమాన్యాన్ని దారికి తీసుకొచ్చారు. మళ్లీ తాజాగా కాలేజీ యాజమాన్యం విద్యార్థినులను ఫీజు పేరుతో దబాయింపు మొదలు పెట్టింది. కాలేజీలో జిల్లాకు చెందిన వారే కాకుండా ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, విశాఖపట్టణం తదితర జిల్లాలకు చెందిన వారు నర్సింగ్ కోర్సు చేస్తున్నారు. మూడు సంవత్సరాలు ఉండే కోర్సులో ప్రవేశ సమయంలో కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజులు చెల్లించి యూనిఫాంలు ఉంటే చాలని, కాలేజీలో మూడేళ్ల కోర్సు పూర్తి చేసుకోవచ్చని చెప్పింది. ప్రస్తుతం మూడు సంవత్సరాలు కోర్సు పూర్తి చేసిన 30 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యం మొండికేస్తోంది. తమకు రూ.50,000 ఫీజుల కింద చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని పేచీ పెడుతుండటంతో విద్యార్థినులు లబోదిబోమంటున్నారు. మూడేళ్ల నర్సింగ్ కోర్సులో ప్రతి ఏడాది 9 నెలల పాటు విద్యార్థినులు క్లినికల్ ఇంటర్న్‌షిప్ కింద హైదరాబాద్‌లోని కార్పొరేట్ హాస్పటల్‌లో పనిచేశారు. ప్రతి హాస్పటల్ కూడా ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.13,000 ఇంటర్న్‌షిప్ కింద చెల్లిస్తోంది. అలా ప్రతి విద్యార్థిని కూడా ఈ మూడేళ్ల కాలంలో 27 నెలలు పాటు ఇంటర్న్‌షిప్ కింద రూ.3.51 లక్షలు ఇచ్చింది. క్లినికల్ ఇంటర్న్‌షిప్ నగదును కాలేజీ యాజమాన్యమే ఆయా హాస్పటల్స్ యాజమాన్యాల నుంచి తీసేసుకుంది. ఆ నగదులో విద్యార్థినులకు పైసా కూడా ఇవ్వలేదు. విద్యార్థినులు కూడా కాలేజీకి తాము ఫీజు కట్టలేదు కదా అని, హాస్పటల్ యాజమాన్యాలు ఇచ్చిన ఇంటర్న్‌షిప్ నుంచి ఏమీ ఆశించలేదు. కానీ కోర్సు పూర్తి అయిన తర్వాత నర్సింగ్ విద్యార్థినులను రూ.50,000 చొప్పున చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ దబాయించడం చేస్తోంది. దీంతో విద్యార్థినులు తమకు అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధి బాటలో మెడికల్ కాలేజీ

- జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామన్



వేడుకలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేడీ డాక్టర్ రామన్ తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన పదేళ్ల కాలంలో దినదినాభివృద్ధి చెందుతూ పేద ప్రజలకు ఆధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేస్థాయికి చేరడం అభినందనీయమని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (విజయవాడ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామన్ అన్నారు. దర్గామిట్టలోని ఏసీఎస్‌ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల 10వ వార్షిక వేడుకలు కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామన్ మాట్లాడుతూ గతంలో నెల్లూరు మెడికల్ కళాశాలలో డాక్టర్ల కొరత ఉండేదన్నారు. ఇప్పుడు డాక్టర్లు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండటమే కాకుండా పీజీ మెడికల్ సీట్లు సైతం ఎన్‌ఎంసీ కేటాయిస్తుండటంతో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు సైతం అందుతున్నాయన్నారు. డీఎంఈ వైపు నుంచి మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి అభివృద్ధికి పూర్తి సహకారమందిస్తానన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు కళాశాల రిపోర్టును ప్రవేశపెట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అనంతరం పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, వైస్ ప్రిన్సిపాల్ డా.నరేంద్ర, డా.చంద్రశేఖర్ నాయుడు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ కాలేషా, డాక్టర్ కేవీఎస్ గీతాదేవి తదితరులు మాట్లాడారు. మెడికో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కళారూపాలు అలరించాయి.

టీబీ, లెప్రసీ రహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న వైద్యాధికారి

నెల్లూరు(అర్బన్): టీబీ, లెప్రసీ రహిత జిల్లాగా నెల్లూరును మార్చేందుకు ప్రతి ఒక్క వైద్యాధికారి, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య సూచించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు టీబీ, లెప్రసీ కేసులపై ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇంటింటి సర్వేతో టీబీ, లెప్రసీ బాధితులను గుర్తించి వారికి పక్కాగా మందులు అందజేసి వాటిని సక్రమంగా విని యోగించుకునేలా చూడాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ, టీబీ, లెప్రసీ జిల్లా నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ ఇటీవల కాలంలో జిల్లాలో చాపకింద నీరులా ఈ కేసులు వ్యాపిస్తున్నాయన్నారు. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ఆ వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించలేకపోతున్నారన్నారు. ప్రాథమికంగా గుర్తించి సత్వర చికిత్స అందించే విధానాలపై సూచనలు చేశారు.

పెన్నాలో దూకి యువతి ఆత్మహత్య



నీటిలో ఆషా మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఏమైందో ఏమో తెలియదుకానీ పెన్నాలో దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ మండల పరిధిలోని టైలర్స్‌కాలనీలో బేల్దారి మస్తాన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె బెంగళూరులో ఉద్యోగం చేస్తుండగా చిన్నకుమార్తె ఆషా(21) బీబీఎం చదివి ఉద్యోగ వేటలో ఉంది. ఇటీవల ఆమె తిరుపతిలో ట్రైనింగ్ పూర్తిచేసుకుని వచ్చింది. ఈనెల 3వ తేదీన ఉద్యోగ పని నిమిత్తం వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఏం జరిగిందో ఏమో తెలియదుకాని ఆమె రంగనాయకులస్వామి గుడి వెనుకవైపు పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఆమె మృతదేహం నదిలో తేలియాడుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు వీఆర్‌ఓ నరేంద్రకు సమాచారం అందించారు. ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నదిలో నుంచి వెలికితీయించి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉంది.